జ్వాల
# దశ
నిజం.. నిర్భయంగా..

WWW.DASHANEWS.COM
శుక్రవారం 17-07-2026
సంపుటి 1 సంచిక 234
పేజీలు : 04
వెల : 1/-
PRGI No : TGTEL/25/A4195









# బోనం ఎత్తిన గోల్కొండ






**జగదాంబిక అమ్మవారికి కుమ్మర్ల తొలి బోనం**

**ప్రభుత్వం తరపున బంగారు బోనం, పట్టు వస్త్రాలు సమర్పించిన మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్**

హైదరాబాద్/జూబ్లీహిల్స్, జూలై 16 : తెలంగాణ సంస్కృతిని, సం ప్రదాయాన్ని ప్రతిబింబించే ఆషాఢ మాస బోనాలు గోల్కొండ కోటలో గురువారం ప్రారంభం అయ్యాయి. జగదాంబిక మహంకాళి అమ్మవారికి కుమ్మర్లు తొలి బోనం సమర్పించి ఉత్సవాలను ప్రారంభించారు. లంగర్ హౌస్ నుంచి పోతురాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య ప్రభుత్వం తరపున మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ బంగారు బోనం, పట్టువస్త్రాలను సమర్పించారు. బోనాలతో గోల్కొండ పరిసరాలు భక్తజన సందోహంగా మారా యి. లంగర్‌హౌస్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సాంస్కృతిక శాఖ రూపొందించిన ఆషాఢ బోనాల ఉత్సవాల బుక్‌లెట్‌ను మం త్రులు ఆవిష్కరించారు. జగదాంబిక ఆలయ కమిటీకి ప్రభుత్వం తరపున రూ.11 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా మం త్రులిద్దరూ ఈరగోల చేతిలో ధరించి భక్తులను ఉత్సాహపరిచారు. మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ.. గోల్కొండ జగదాంబిక అమ్మవారి కృపతో ఎల్ నినో ప్రభావం తగ్గి, భూతల్లి శాంతించి సమృద్ధిగా వర్షాలు కురవాలని కాంక్షించారు. మంత్రి పొన్నం మాట్లాడుతూ.. గోల్కొండ బోనాలకు ఎంతో ప్రాముఖ్యత ఉందని అన్నారు. తెలంగాణ బోనాలు సంస్కృతి

..మిగతా 4వ పేజీలో →





## పూరీ జగన్నాథ రథయాత్రలో
# తొక్కిసలాట..

## ఇద్దరు మృతి, 100 మందికి పైగా గాయాలు

**10 లక్షల మందికిపైగా భక్తులు హాజరు**

**దేవతా మూర్తులను తీసుకొస్తుండగా స్వల్ప తొక్కిసలాట**



గోపాల్‌పూర్: ఒడిశాలోని పూరీ జగన్నాథ రథయాత్ర (Puri Jagannath Rath Yatra) లో అపశ్రుతి చోటుచేసుకుంది. భారీగా భక్తులు తరలి రావడంతో తొక్కిసలాట జరిగింది. ఈ ఘటనలో ఇద్దరు మృతిచెందగా.. 100 మందికి పైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రులకు తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుల్లో ఒకరిని కటక్‌కు చెందిన అనిల్ దాస్‌గా గుర్తించారు. మరోకరి వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు, అధికారులు పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

భువనేశ్వర్, జూలై 16: ఒడిశా భువనేశ్వర్ పూరి ప్రముఖ పుణ్యక్షేత్రంలో గురువారం ప్రారంభమైన జగన్నాథ్ రథయాత్ర అంగరంగ వైభవంగా కొనసాగింది. దేశ నలుమూలల నుంచి 10 లక్షల మందికిపైగా భక్తులు తరలివచ్చారు. భారీ వర్షంలోనూ.. భక్తులు 'జై జగన్నాథ్' నామస్మరణలతో ఆ ప్రాంతం మార్మోగింది. బలభద్రుడు, సుభద్రాదేవి, కొలువై ఉన్న రథాలను లాగేందుకు భక్తులు పోటీ పడ్డారు. 'గ్రాండ్ రోడ్'పై రథాలపై దేవుళ్లను చూసిన అశేషజనవాహిని భక్తిపారవశంతో తన్మయత్వం చెందారు. లక్షలాది మంది భక్తులు మొదట బలభద్ర స్వామి వారి 'తలధ్వజ' రథాన్ని, ఆ తర్వాత దేవి సుభద్ర రథం 'దర్పదలన'ను లాగారు. వీరి వెనుక జగన్నాథ స్వామి వారి

..మిగతా 4వ పేజీలో →

# యూత్ డిక్లరేషన్ ఓ వంచన

## కాంగ్రెస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు వరుస సభలు

**18న సరూర్‌నగర్‌లో భారీ యువజన సదస్సు..**

**ప్రభుత్వం ప్రజల విశ్వాసాన్ని కోల్పోయింది**

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**



హైదరాబాద్, జూలై 16 : 'యూత్ డిక్లరేషన్' పేరుతో అలవిగాని హామీలిచ్చి నిరుద్యోగులను వంచించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం తప్పదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హెచ్చరించారు. రాష్ట ప్రభుత్వం ప్రజల నమ్మ కాన్ని పూర్తిగా కోల్పోయిందని, పదవీకాలం సగం పూర్తికాకముందే తీవ్ర వ్యతిరేకతను మూటగట్టుకున్న ప్రభుత్వంగా చరిత్రలో నిలిచిపోతుందని కేటీ ఆర్ పేర్కొన్నారు. ఎన్నికల హామీల అమలు వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు బీఆర్ఎస్ వరుసగా సభలు నిర్వహిస్తుందన్నారు. వరంగల్ సభ అనంతరం, ఈనెల 18న సరూర్‌నగర్ స్టేడియంలో యువత, విద్యార్థులతో 'యువ సంగ్రామ' సదస్సు నిర్వహించి కాంగ్రెస్ యూత్ డిక్లరేషన్ వైఫల్యాలను ప్రజల ముందుంచనున్నట్లు కేటీ ఆర్ ప్రకటించారు. గురువారం ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి నివాసంలో పార్టీ నేతలతో పాటు హైదరాబాద్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ప్రజాప్రతినిధులతో విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సరూర్‌నగర్ యువజన సభ ఏర్పాట్లు, నిర్వహణపై చర్చించారు. యువజన సభకు కాంగ్రెస్ పార్టీ అడ్డంకులు సృష్టించే అవకాశం ఉందని, సమర్థంగా ఎదుర్కొనేందుకు నాయకులు, కార్యకర్తలు సిద్ధంగా ఉండాలని కేటీఆర్ సూచించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా అన్ని వర్గాలను

..మిగతా 4వ పేజీలో →



## దూరదృష్టి లేకనే
# అంధకారం

**బొగ్గు నిల్వలపై ప్రభుత్వానికి ప్రణాళిక లేదు**

**ధ్యాసంతా కమీషన్లపైనే.. మాజీ మంత్రి హరీశ్‌రావు**

హైదరాబాద్, జూలై 16: రాష్ట్రంలో విద్యుత్ సంక్షోభానికి ప్రభుత్వానికి ముందుచూపు లేకపోవడమేనని కారణమని బీఆర్ఎస్ఎల్పీ ఉపనేత, మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. అప్రకటిత కరెంట్ కోతలతో అన్ని వర్గాల ప్రజలు అవస్థలు పడుతున్నారని, 11 జిల్లాల్లో రైతులు సబ్ స్టేషన్ల ఎదుట ధర్నాలు చేయాల్సిన పరిస్థితి వచ్చిందన్నారు. థర్మల్ విద్యుత్ కేంద్రాల్లో

..మిగతా 4వ పేజీలో →



## పైసా వృథా కాకుండా
# సీతారామ పూర్తి

**చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం**

**కేసీఆర్ పాలనలో ధన దోపిడీ**

**రీ డిజైన్ల పేరిట వేల కోట్ల లూటీ**

**గోదావరి జలాలపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక: డిప్యూటీ సీఎం భట్టి**

**ప్రాణహితకు మళ్లీ ప్రాణం**

**భద్రాద్రి జిల్లాలో సీతారామ ప్రాజెక్టు సందర్శన**

4లో




## జర్నలిస్టుల సమస్యలను తప్పకుండా పరిష్కరిస్తాం

- ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు
- మంత్రిని కలిసిన టీడబ్ల్యూజేఎఫ్ నేతలు



**దశ, హైదరాబాద్:** రాష్ట్రంలోని జర్నలిస్టులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు స్పష్టం చేశారు. జర్నలిస్టుల సంక్షేమం, వృత్తిపరమైన భద్రతకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆయన పేర్కొన్నారు. గురువారం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య నేతృత్వంలోని ప్రతినిధి బృందం మంత్రి శ్రీధర్ బాబు ను హైదరాబాద్ లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిసి "టీడబ్ల్యూజేఎఫ్ మీడియా డైరీ" ని అందజేసింది. ఈ సందర్భంగా ఫెడరేషన్ రాష్ట్రవ్యాప్తంగా జర్నలిస్టులు ఎదుర్కొంటున్న పలు కీలక సమస్యలను మంత్రి దృష్టికి తీసుకెళ్లింది. చాలా కాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సంక్షేమ అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లి, త్వరితగతిన పరిష్కారానికి చర్యలు చేపట్టాలని మామిడి సోమయ్య విజ్ఞప్తి చేశారు. దీనికి స్పందించిన మంత్రి శ్రీధర్ బాబు, జర్నలిస్టుల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తుందని, ముఖ్యమంత్రితో చర్చించి వీలైనంత త్వరగా పరిష్కార మార్గాలను అన్వేషిస్తామని హామీ ఇచ్చారు. ప్రజాస్వామ్యంలో జర్నలిస్టుల పాత్ర అత్యంత కీలకమని, వారి సంక్షేమం పట్ల ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో టీడబ్ల్యూజేఎఫ్ ప్రతినిధులు కుంచెం శ్రీనివాస్, వి. రవికుమార్, పర్కాల సమ్మయ్య గౌడ్, చొల్లేటి బ్రహ్మచారి, ఎం.రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వాన నీటిని ఒడిసి పట్టి
# భూగర్భ జలాలను కాపాడుకుందాం



- చౌటుప్పల్ చైర్‌పర్సన్ పావని రమేష్ గౌడ్

**దశ, చౌటుప్పల్:** వాన నీటిని వృథా కాకుండా ఒడిసి పట్టి భూగర్భ జలాలను సంరక్షించాలని, ప్రతి ఇంటిలో తప్పనిసరిగా ఇంకుడు గుంతలు నిర్మించాలని చౌటుప్పల్ మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ పిలుపునిచ్చారు. గురువారం చౌటుప్పల్ మున్సిపల్ కార్యాలయ ఆవరణలో 'జలశక్తి అభియాన్ - వాన నీటిని సంరక్షిద్దాం, ఉన్న నీటిని సద్వినియోగం చేసుకుందాం' కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అవగాహన సభ, ప్రతిజ్ఞ కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నీరు జీవనాధారమని, మారుతున్న వాతావరణ పరిస్థితుల దృష్ట్యా వర్షపు నీటిని వృథా చేయకుండా ఇంకుడు గుంతల ద్వారా భూమిలోకి పంపించడం అత్యంత అవసరమని అన్నారు. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలో ప్రతి కుటుంబం ఇంకుడు గుంతలు ఏర్పాటు చేసి భూగర్భ జలాల పరిరక్షణలో భాగస్వాములు కావాలని కోరారు. ప్రజల సహకారంతో పట్టణాన్ని జలసమృద్ధిగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్, వైస్ చైర్మన్ గోశిక వినయ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు కలిసి వాన నీటి సంరక్షణపై అవగాహన కల్పించే గోడపత్రికను ఆవిష్కరించారు.

అనంతరం నీటి సంరక్షణ, సద్వినియోగంపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, బద్రి గాలయ్య, పాక చిరంజీవి, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్, కోఆప్షన్ సభ్యులు పస్తం గంగా రాములు, మహమ్మద్ బాబా షరీఫ్, నాయకులు దేప రాజు, బత్తుల దాసు, చింతల సాయిలు, మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్.ఓ. అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ దీప, జూనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్, జేఏఓ శ్రీనాథ్, మహేష్‌తో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## అనారోగ్యంతో చికిత్స పొందుతున్న జర్నలిస్టు సురేందర్‌ను పరామర్శించిన టీయూడబ్ల్యూజే నాయకులు

**దశ, తుర్కయంజాల్:** నవతెలంగాణ రిపోర్టర్ సురేందర్ గత కొన్ని రోజులుగా అనారోగ్యంతో నగరంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న తెలంగాణ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) నాయకులు గురువారం ఆసుపత్రికి వెళ్లి ఆయనను పరామర్శించారు.

ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా కార్యదర్శి మేకల సత్యనారాయణ, జిల్లా ఉపాధ్యక్షుడు జెనిగె పాండు యాదవ్, జిల్లా కోశాధికారి శశిపాల్ రెడ్డి, ఎల్బీనగర్ నవతెలంగాణ ఇన్‌చార్జి రాజశేఖర్ కలిసి సురేందర్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ మనోధైర్యాన్ని నింపారు. సురేందర్ పూర్తి ఆరోగ్యంతో త్వరలోనే విధుల్లోకి తిరిగి రావాలని వారు ఆకాంక్షించారు.

## సూర్యాపేట ఆర్యవైశ్య సంఘం పరువును దిగజార్చవద్దు

*ఆర్యవైశ్య పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాలి*



**దశ సూర్యాపేట ప్రతినిధి :** సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు పదవుల విషయంలో ఒకరిపై ఒకరు సమస్యలు చేసుకుంటూ ఆర్యవైశ్య సంఘం పరువును దిగజార్చ వద్దని సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం నాయకులు కలకోట లక్ష్మయ్య, కుక్కడపు శ్రీనివాస్, మీలా వంశీ లు అన్నారు. సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య కౌన్సిల్ సమావేశంలో వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి పోటీ ఉందని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి నేడు రాచర్ల కమలాకర్ కు పదవి ఎలా ఇస్తారని ప్రశ్నించారు. ఇప్పటికే వర్కింగ్ ప్రెసిడెంట్గా రాచర్ల కమలాకర్ ఫ్లెక్సీలలో వేయించుకున్నాడని దీనిపై వీలైనంత త్వరగా నిర్ణయం తీసుకోవాలన్నారు. ప్రమాణ స్వీకారానికి ఇంకా మూడు రోజుల సమయం ఉన్నందున ఆర్యవైశ్య పెద్దమనుషుల సమక్షంలో సమస్యను పరిష్కరించుకోవాల్సిందిగా సూచించారు. పట్టణ ఆర్యవైశ్య సంఘ నూతన అధ్యక్షుడు బేలిదే శ్రీనివాస్ బే షజాలకు పోకుండా అందరిని సమాన దృష్టితో చూడాలని ఎన్నికల్లో తనకు ఓటు వేయని వారిని ప్రశ్నిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని ఇప్పటికైనా అలాంటి విధానాలు మార్చుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు వంగవీటి రమేష్, కొండ కరుణాకర్, మంచాల శ్రీనివాస్, పల్లెర్ల ప్రసాద్, తవిడిశెట్టి కృష్ణకుమార్, పసుమర్తి కృష్ణమూర్తి తదితరులు ఉన్నారు.

# చౌటుప్పల్‌లో ఓటరు అవగాహన ప్రచార రథాలకు శ్రీకారం



- ప్రతి అర్హుడూ ఓటరుగా నమోదు కావాలి: చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్

**దశ, చౌటుప్పల్:** చౌటుప్పల్ పురపాలక సంఘ పరిధిలో ఓటు హక్కుపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రెండు ఓటరు అవగాహన ప్రచార రథాలను మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని రమేష్ గౌడ్ శుక్రవారం మున్సిపల్ కార్యాలయ ప్రాంగణంలో జెండా ఊపి ప్రారంభించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు చేపట్టిన "స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (SIR)-2026" కార్యక్రమంలో భాగంగా ఈ ప్రచార రథాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మాట్లాడుతూ, ఏ అర్హుడైన ఓటరు కూడా ఓటు హక్కును కోల్పోకుండా ఉండేలా ప్రత్యేక ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. పట్టణంలోని ప్రతి వార్డులో జూన్ 25 నుంచి ఆగస్టు 3, 2026 వరకు బూత్ లెవల్ అధికారులు (BLOలు) ఇంటింటికీ వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాల ద్వారా వివరాలు సేకరిస్తారని, ప్రజలు తమ వివరాలను నమోదు చేయించుకోవడంతో పాటు ఓటర్ల జాబితాలోని వివరాలను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని సూచించారు. మున్సిపల్ కమిషనర్ ఎన్. వెంకటేశ్వర నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ గోషిక వినయ్ కుమార్, వార్డు కౌన్సిలర్లు కొసనం రాకేష్ రెడ్డి, బద్రి గాలయ్య, పాక చిరంజీవి, పిల్లలమర్రి మధుసూదన్, హన్ను మహమ్మద్, కోఆప్షన్ సభ్యులు పస్తం గంగా రాములు, మహమ్మద్ బాబా షరీఫ్, నాయకులు దేప రాజు, బత్తుల దాసు, చింతల సాయిలుతో పాటు మున్సిపల్ మేనేజర్ శ్రీధర్ రెడ్డి, ఆర్.ఓ. అంజయ్య, శానిటరీ ఇన్స్పెక్టర్ హనుమాన్ ప్రసాద్, సీనియర్ అసిస్టెంట్ దీప, జూనియర్ అసిస్టెంట్ పవన్ కుమార్, జేఏఓ శ్రీనాథ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కూడా పాల్గొని ప్రచార రథాలకు ఘనంగా వీడ్కోలు పలికారు.

## బీసీ హక్కుల సాధన కోసం పోరాటం చేయాలె: ఎంపీ ఆర్ కృష్ణయ్య



**దశ ఓయూ:** దశాబ్దాలుగా బీసీ వర్గాలు అణిచివేతకు గురవుతున్నారని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య ఆవేదన వ్యక్తం చేశారు. బీసీల హక్కుల సాధన కోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. గురువారం విద్యానగర్ బీసీ భవన్ లో బీసీ యువజన సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ తంగళ్ళపల్లి కమలాకర్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశంలో ఆర్ కృష్ణయ్య మాట్లాడుతూ దేశవ్యాప్తంగా బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేసి ప్రత్యేక మంత్రిత్వ శాఖను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఫీజు రీయింబర్స్మెంట్ పథకాన్ని ఎత్తివేయకుండా యధా విధంగా అమలు చేయాలని కోరారు. యువజన సంఘం రాష్ట్ర జనరల్ సెక్రటరీ తంగళ్ళపల్లి కమలాకర్ తన జన్మదినం సందర్భంగా ఆర్.కృష్ణయ్య ఆశీస్సులు తీసుకొని మాట్లాడారు. బీసీలకు సాధన కోసం ఆర్ కృష్ణయ్య నేతృత్వంలో పోరాడుతామని తెలిపారు. ఈ సమావేశంలో అరుణ్ శివాలయం, అనంతయ్య, పృధ్వి గౌడ్, రాజనేత, ప్రవీణ్, ప్రియదర్శిని, బలరాం, కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సేవా స్ఫూర్తితో ఘనంగా శివప్రసాద్ జన్మదిన వేడుకలు



**దశ సూర్యాపేట ప్రతినిధి :** యువ నాయకులు దిండుగల్ల శివప్రసాద్ జన్మదినాన్ని పురస్కరించుకుని సూర్యాపేట పట్టణంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఏడవ వార్డు యువ నాయకులు మామిడి శ్రవణ్ కుమార్ ఆధ్వర్యంలో ఏరియా హాస్పిటల్‌లో రోగులకు బ్రెడ్ పంపిణీ చేసి మానవతా దృక్పథాన్ని చాటారు. అనంతరం కొత్త బస్టాండ్ ఫ్లైఓవర్ సమీపంలో అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి పలువురు నిరుపేదలు, ప్రయాణికులు, అవసరమైన వారికి భోజనం అందించారు. రాత్రి స్థానిక వార్డు ప్రజల మధ్య భారీ కేకు కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జన్మదిన వేడుకలను ఆడంబరంగా కాకుండా సమాజానికి ఉపయోగపడే సేవా కార్యక్రమాల రూపంలో నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. ప్రజలకు సేవ చేయడమే నిజమైన వేడుక అని పేర్కొన్నారు. నాయకుడి సేవాభావం, ప్రజల పట్ల అంకితభావాన్ని కొనియాడుతూ ఆయన మరెన్నో విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమాల్లో వార్డు యువ నాయకులు వీరమల్ల రవి చరణ్ గౌడ్, బంధా కిరణ్, బోడ వినోద్, సందీప్, కోల మహేష్, బొజ్జ ఉపేందర్, పోలేటి పవన్, బన్నీ,బంధా సాయి, తండు బన్నీ, మహేష్, అభిమానులు, మిత్రులు, స్థానిక నాయకులు, సామాజిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# వారాహి జ్యువెల్స్ 3వ వార్షికోత్సవం
# సందర్భంగా ప్రత్యేక ఆభరణాల ప్రదర్శన



**దశ, హైదరాబాద్:** ప్రముఖ ఆభరణాల సంస్థ వారాహి జ్యువెల్స్ తమ 3వ వార్షికోత్సవ వేడుకలను జూలై 16 నుంచి 19 వరకు కావూరి హిల్స్‌లోని షోరూమ్‌లో నిర్వహించనున్నట్లు సంస్థ వ్యవస్థాపకుడు సందీప్ కరణం తెలిపారు. ఈ సందర్భంగా వేలాది సరికొత్త డిజైన్లతో కూడిన ప్రత్యేక జ్యువెలరీ ప్రదర్శనను, సేల్ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. ఈ నాలుగు రోజుల ప్రదర్శనను మల్లారెడ్డి విద్యాపీఠం వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ప్రీతి రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై దీపప్రజ్వలనతో ప్రారంభించారు. హైదరాబాద్, విజయవాడ, తిరుపతి నగరాల్లో సేవలందిస్తున్న వరాహి జ్యువెల్స్ నాణ్యత, విశ్వసనీయత, వినియోగదారుల సేవలకు ప్రాధాన్యతనిస్తూ వధువులు, కుటుంబాల ఆదరణ పొందుతోందన్నారు. సంప్రదాయ కళాత్మకతకు ఆధునికతను జోడించి డైమండ్, కుందన్, పోల్కీ, నక్ష్, టెంపుల్ జ్యువెలరీతో పాటు డైలీ వేర్ ప్రత్యేక కలెక్షన్లను అందిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రెడ్డి మాట్లాడుతూ ప్రదర్శనలో ఉన్న వాటిలో చాలా వెరైటీస్ బాగున్నాయి బంగారం, వెండి, వెండి మీద బంగారం పూత వంటి ఎన్నో వెరైటీలు ప్రదర్శనలో ఉంచడంతోపాటు సేల్ కూడా నిర్వహించడం ఆనందంగా ఉంది వీరి డిజైన్స్ చాలా ప్రత్యేకం గా అందర్నీ ఆకట్టుకునేలా ఉన్నాయని బంగారం ప్రియులు అందరూ వచ్చి ఈ అవకాశాన్ని అందిపుచ్చుకోవాలని ఆమె తెలిపారు.

## వినియోగదారుల మన్ననలను పొందాలి

**దశ, సూర్యాపేట ప్రతినిధి:** వినియోగదారుల మన్ననలు పొందితేనే ఏ వ్యాపారమైనా విజయవంతంగా ముందుకు సాగుతుందని ముస్లిం మత పెద్ద అత్తర్ మౌలానా అన్నారు. బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా కేంద్రంలోని మూవీ మ్యాక్స్ పక్కన నూతనంగా ఏర్పాటు చేసిన టీ హెవెన్ ఇరానీ చాయ్ కేఫ్ ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా యువత ప్రభుత్వ ఉద్యోగుల కోసం ఎదురు చూడకుండా స్వశక్తితో ఎదగాలి అని అన్నారు.టీ హెవెన్ ఇరానీ చాయ్ కేఫ్ మంచి పేరు తెచ్చుకొని విజయవంతంగా కొనసాగాలని ఆకాంక్షిస్తూ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మాదా నవీన్ గౌడ్, ఖలీల్ సాబ్, వజిత్ మౌలానా సాబ్, ముఫ్తి అస్రర్ సాబ్, మౌలానా రఫీ, మౌలానా షఫీద్, నిర్వాహకులు మహమ్మద్ రఫీ యుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.



# సీతమ్మసాగర్–సీతారామ ప్రాజెక్టులను త్వరితగతిన పూర్తి చేసి ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరి జలాలను పుష్కలంగా అందిస్తాం: మంత్రులు

- మంత్రులకు ఘనంగా స్వాగతం పలికిన ఎమ్మెల్యేలు
- ప్రతి ఎకరాకు నీళ్లు అందిస్తాం
- కాంగ్రెస్ ప్రభుత్వం అంటేనే రైతుల పక్షపాతి
- ప్రాజెక్టు పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి:** జిల్లాలోని అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన పనులు, మిగిలిన పనులు, అవసరమైన నిధులు తదితర అంశాలను మంత్రులకు వివరించారు.

### గోదావరి జలాలను పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడమే ప్రభుత్వ లక్ష్యం : ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని సాధ్యమైనంత మేర పూర్తిస్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతోందన్నారు. అందుబాటులో ఉన్న ప్రాంతాల్లో గ్రావిటీ ద్వారా, అవసరమైన చోట లిఫ్ట్ ఇరిగేషన్ ద్వారా నీటిని తరలించేలా ప్రణాళిక అమలు చేస్తున్నట్లు తెలిపారు. జలయజ్ఞం కార్యక్రమంలో భాగంగా దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖర్ రెడ్డి నాయకత్వంలో రాజీవ్ సాగర్ ప్రాజెక్టు రూ.1,640 కోట్లతో రెండు లక్షల ఎకరాలకు, ఇందిరా సాగర్ ప్రాజెక్టు రూ.1,680 కోట్లతో మరో రెండు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే లక్ష్యంతో ప్రారంభించబడినట్లు తెలిపారు. మొత్తం సుమారు రూ.3,500 కోట్ల అంచనా వ్యయంతో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించే ప్రణాళిక రూపొందించబడిందన్నారు.

రాష్ట్ర విభజనకు ముందు ఈ రెండు ప్రాజెక్టులపై సుమారు రూ.2,000 కోట్ల వరకు వ్యయం జరిగిందని, మిగిలిన పనులకు సుమారు రూ.1,505 కోట్లు అవసరమయ్యే పరిస్థితి ఉండేదన్నారు. అనంతర కాలంలో ప్రాజెక్టు పునఃరూపకల్పనతో అంచనా వ్యయం సుమారు రూ.24 వేల కోట్లకు పెరిగిందని, ఇప్పటికే రూ.7,500-8,000 కోట్ల వరకు వ్యయం జరిగినట్లు వివరించారు. ప్రస్తుతం భారీ ప్రజాధనం ఇప్పటికే వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు ప్రయోజనం చేకూర్చడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. సీతమ్మసాగర్, సీతారామ, దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వ్యవస్థలను సమన్వయం చేసి గోదావరి జలాలను గరిష్టంగా వినియోగించుకునేలా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రతి నెలా పనుల పురోగతిని సమీక్షిస్తూ అవసరమైన నిధులు విడుదల చేసి ప్రాజెక్టును నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు మంత్రి తెలిపారు.

### సీతారామ ప్రాజెక్టును నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేస్తాం : మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



రాష్ట్ర నీటిపారుదల మరియు పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు అత్యంత కీలకమైన సాగునీటి ప్రాజెక్టు అని అన్నారు . ఇప్పటికే ప్రాజెక్టుపై గణనీయమైన ప్రజాధనం వ్యయమైనందున మిగిలిన పనులను వేగంగా పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక కార్యాచరణ అమలు చేస్తోందన్నారు. రాష్ట్రంలో ఇరిగేషన్ రంగంపై గతంలో సుమారు రూ.1.81 లక్షల కోట్లకు పైగా వ్యయం జరిగినప్పటికీ అనేక ప్రాజెక్టులు ఇంకా వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుపై సుమారు రూ.27,500 కోట్లు వ్యయం జరిగినట్లు తెలిపారు . ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులను దశలవారీగా పూర్తి చేయడంపై ప్రభుత్వం దృష్టిసారించిందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్టులోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలకు సంబంధించి జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ (ఎన్ డి ఎస్ ఎ ), కేంద్ర జల సంఘం (సీ డబ్ల్యూ సీ ) సూచనల మేరకు సాంకేతిక పరీక్షలు, భూగర్భ పరిశీలనలు, నిర్మాణ భద్రతా అధ్యయనాలు కొనసాగుతున్నాయని తెలిపారు. నిపుణుల నివేదికల ఆధారంగా అవసరమైన పునరుద్ధరణ చర్యలు చేపట్టనున్నట్లు తెలిపారు . ప్రజల భద్రత, నిర్మాణ నాణ్యత, నీటి నిల్వ సామర్థ్యానికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ అన్ని నిర్ణయాలు శాస్త్రీయ ప్రమాణాల ఆధారంగానే తీసుకుంటున్నామని వివరించారు.

సీతారామ ప్రాజెక్టులోని పంప్‌హౌస్‌లు, బ్యారేజ్, కాలువలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్యవస్థల నిర్మాణాన్ని వేగవంతం చేసి నిర్ణీత గడువులో పూర్తి చేయాలని అధికారులను ఆదేశించినట్లు తెలిపారు. గత రెండున్నర సంవత్సరాలలో రికార్డు స్థాయిలో వరి ధాన్యం పండించి రైతుల ఖాతాల్లో రూ.80 వేల కోట్లకు పైగా రైతులకు నేరుగా జమ చేసినట్లు తెలిపారు . ధాన్యం కొనుగోళ్లలో తెలంగాణ రాష్ట్రం దేశంలో ముందంజలో నిలిచిందన్నారు. సీతమ్మసాగర్-సీతారామ ప్రాజెక్టు పూర్తయిన తర్వాత సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్ పై ఉన్న న్యాయపరమైన చిక్కులను పరిష్కరించుకొని త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చూస్తామన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిస్ట్రిబ్యూటరీ కెనాల్ పనులు కూడా త్వరితగతిన పూర్తి చేసి జిల్లా లో గోదావరి జలాలను వినియోగించే విధంగా అదేవిధంగా ఇల్లందు నియోజకవర్గంలో కూడా నీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

### ప్రాజెక్టు పనులను వేగవంతం చేసి రైతులకు సాగునీరు అందిస్తాం : మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచారం మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాను సస్యశ్యామలం చేయాలనే లక్ష్యంతో ప్రారంభమైన సాగునీటి ప్రాజెక్టులను పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. సీతమ్మసాగర్ బ్యారేజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను ప్రత్యక్షంగా పరిశీలించి మిగిలిన పనులను త్వరితగతిన పూర్తి చేసేందుకు అవసరమైన చర్యలపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రాజెక్టుకు అవసరమైన ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర పనుల కోసం సుమారు రూ.1,000 కోట్లకు పైగా నిధులు విడుదల చేసినట్లు తెలిపారు . గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలిసిపోకుండా పంపింగ్ వ్యవస్థను అందుబాటులోకి తీసుకువచ్చి నీటి వినియోగాన్ని పెంచేందుకు చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రాజెక్టు ద్వారా సుమారు 1.25 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు అవసరమైన అన్ని పనులను వేగవంతం చేస్తున్నామని, అవసరమైన చోట అదనపు నిధులు కూడా విడుదల చేస్తామని చెప్పారు. రైతులకు సాగునీరు, ప్రజలకు తాగునీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిస్థాయిలో కట్టుబడి ఉందని అన్నారు .

జిల్లా కలెక్టర్ అంకిత్ ప్రాజెక్టు పనుల ప్రస్తుత పురోగతి, భూసేకరణ, పునరావాసం, విద్యుత్ అనుసంధానం, అనుబంధ మౌలిక సదుపాయాల కల్పన, శాఖల మధ్య సమన్వయంపై మంత్రులకు వివరించారు. ప్రాజెక్టు పనులకు అవసరమైన పరిపాలనా అనుమతులు, భూ సంబంధిత అంశాలను వేగవంతంగా పరిష్కరిస్తూ, ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా పనులు పూర్తి చేసేందుకు జిల్లా యంత్రాంగం పూర్తి సహకారం అందిస్తోందని తెలిపారు. ప్రాజెక్టు పనుల పురోగతిపై జిల్లా స్థాయిలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తూ, శాఖల సమన్వయంతో పెండింగ్ అంశాలను త్వరితగతిన పరిష్కరిస్తున్నట్లు వివరించారు. అనంతరం మంత్రులు మారెళ్ళ పాడు ఎత్తిపోతల పథకాన్ని పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

ఈ కార్యక్రమంలో పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి,జిల్లా కలెక్టర్ అంకిత్ జిల్లా ఎస్పీ రోహిత్ రాజు, నీటిపారుదల శాఖ అధికారులు, భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ట, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, సంబంధిత శాఖల అధికారులు ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# అగ్నికి ఆహుతైన మెకానిక్ షెడ్

- అగ్నిమాపక శాఖ వైఫల్యమా..?
- పనిచేయని ఫైర్ ఇంజిన్..!
- కళ్లముందే బూడిదైన కార్ మెకానిక్ షెడ్

**దశ, మణుగూరు:** మణుగూరు మెయిన్ రోడ్డులో గుట్ట మల్లారం గ్రామపంచాయతీ పరిధిలోని ఓ కార్ మెకానిక్ షెడ్డు ఈరోజు ఉదయం సుమారు 11:30 గంటలకు షార్ట్ సర్క్యూట్ కారణంగా అగ్నికి ఆహుతైంది. ఒక్కసారిగా చెలరేగిన మంటలు క్షణాల్లోనే షెడ్డు మొత్తాన్ని చుట్టుముట్టడంతో భారీ ఆస్తి నష్టం సంభవించింది. మంటలను గమనించిన మెకానిక్ వెంటనే అగ్నిమాపక శాఖకు సమాచారం అందించాడు. అయితే, అత్యవసర సమయంలో వెంటనే చేరాల్సిన అగ్నిమాపక సిబ్బంది ఆలస్యంగా ఘటనాస్థలానికి చేరుకున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

మరింత ఆందోళనకరమైన విషయం ఏమిటంటే, అక్కడికి చేరుకున్న అగ్నిమాపక వాహనం సక్రమంగా పనిచేయకపోవడంతో మంటలను అదుపు చేయడంలో విఫలమైందని ప్రత్యక్ష సాక్షులు తెలిపారు. దీంతో మంటలు మరింత ఉద్ధృతమై కార్ మెకానిక్ షెడ్డు పూర్తిగా దగ్ధమైంది. స్థానికులు తమ వంతుగా మంటలను ఆర్పేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితం లేకపోయింది. అగ్నిమాపక సిబ్బంది సమయానికి స్పందించి, ఫైర్ ఇంజిన్ సక్రమంగా పనిచేసి ఉంటే ఈ స్థాయి నష్టం జరిగి ఉండేదే కాదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేశారు. ఘటనపై అగ్నిమాపక శాఖ పనితీరుపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అత్యవసర సేవల్లో ఇలాంటి నిర్లక్ష్యం ఎందుకు చోటుచేసుకుందో ఉన్నతాధికారులు విచారణ జరిపి, వాస్తవాలను వెలికితీసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ఈ ఘటనపై జాతీయ వినియోగదారులు & మానవ హక్కుల పరిరక్షణ సమితి రాష్ట్ర సీనియర్ ఉపాధ్యక్షులు మందడిసంజీవరావు స్పందించారు.

ఈ ప్రమాదంలో షెడ్డు నిర్వహిస్తున్న ఇద్దరు యువకులు పూర్తిగా ఉపాధిని కోల్పోయారని, వారు తమ కష్టార్జితంతోనే జీవనం సాగిస్తున్న నిరుపేద కుటుంబాలకు చెందిన వారని అన్నారు. ఈ అగ్నిప్రమాదంలో సుమారు రూ.15 నుంచి రూ.20 లక్షల వరకు ఆస్తి నష్టం జరిగినట్లు ప్రాథమిక అంచనా ఉందన్నారు. బాధితులను ప్రభుత్వం తక్షణమే ఆదుకుని తగిన ఆర్థిక సాయం అందించాలని, అలాగే స్వచ్ఛంద సంస్థలు, దాతలు, ప్రజాప్రతినిధులు మానవతా దృక్పథంతో ముందుకు వచ్చి బాధిత కుటుంబాలకు చేయూతనివ్వాలని మందడిసంజీవరావు విజ్ఞప్తి చేశారు.

# సమాధానాలు చెప్పలేకనే అక్రమ అరెస్టులు

- పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు ప్రశ్నలకు మంత్రులు సమాధానం చెప్పాలి
- బి ఆర్ ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి డిమాండ్




**దశ, పినపాక:** కాంగ్రెస్ ప్రభుత్వం సీతారామ ప్రాజెక్టు నిర్మాణ పనులపై పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పలేకనే బీఆర్ఎస్ పార్టీ నాయకులను, కార్యకర్తలను అక్రమ అరెస్టులు చేస్తున్నారని బి ఆర్ ఎస్ పార్టీ పినపాక మండల అధ్యక్షులు పగడాల సతీష్ రెడ్డి అన్నారు. పినపాక నియోజకవర్గంలో అశ్వాపురం మండలంలో నలుగురు రాష్ట్ర మంత్రుల పర్యటన నేపథ్యంలో పినపాక మండల బిఆర్ఎస్ పార్టీ నాయకులను గురువారం ఏడూళ్లబయ్యారం పోలీసులు ముందస్తు అరెస్టులు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతూ.. సీతారామ ప్రాజెక్టు ద్వారా భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు, పినపాక నియోజకవర్గంలో మిగిలిన మండలాలకు మారేళ్లపాడు ద్వారా సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం సిగ్గుచేటన్నారు. కాంగ్రెస్ మంత్రులు కేవలం ప్రచారానికి మాత్రమే పర్యటనలు చేస్తున్నారని అన్నారు. పినపాక మాజీ ఎమ్మెల్యే రేగా కాంతారావు రైతుల పక్షాన అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పినపాక మాజీ ఎంపీపీ గుమ్మడి గాంధీ, ముఖ్య నాయకులు దాట్ల వాసుబాబు, సొసైటీ అధ్యక్షులు రవివర్మ, పోలిశెట్టి సత్తిబాబు, కాయం శేఖర్, మొగిలిపల్లి నరసింహారావు, బుల్లిబాబు, సర్వేశ్వరరావు, వై.చెన్నకేశవులు, జాంఫీర్ బూర రమేష్, ముక్కు వెంకటేశ్వరరెడ్డి, దాసరి రవి, కాళ్ల చంటి, అశోక్, శ్రీను, మునిగెల సంతోష్, ముక్కు నాసర్‌రెడ్డి, రామారావు, జంపయ్య, బూర సురేష్, వీర్రాజ, నరేష్, మురళి, సురేందర్, తదితరులు పాల్గొన్నారు.

# అక్రమ అరెస్టులు భయపడం

- జిల్లా రైతులకు సాగునీరు అందించాలి..
- బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు




**దశ బూర్గంపాడు:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రజలకు సీతారామ ప్రాజెక్టు నీళ్లు అందించేందుకు బిఆర్ఎస్ పార్టీ నాయకుల పోరాటం ఆగదని అక్రమ అరెస్టులకు భయపడేది లేదని నాయకులు పేర్కొన్నారు. తమ ప్రాంతానికి నీళ్లు ఇవ్వకుండా ఇతర ప్రాంతాలకు నీళ్లు ఇచ్చేందుకు సీతారామ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన ఉప ముఖ్యమంత్రి సహా ముగ్గురు మంత్రులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీతారామ ఎత్తిపోతల ప్రాజెక్టు విషయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని ప్రాజెక్టు పరిశీలనకు ఉప ముఖ్యమంత్రి సహా ముగ్గురు మంత్రులు జిల్లాకు వస్తున్న నేపథ్యంలో రైతుల తరఫున ప్రశ్నించాలని పార్టీ పిలుపునిచ్చిన వేళ, ముందస్తుగా బీఆర్ఎస్ నాయకులను పోలీసులు అరెస్టు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు. రైతుల సమస్యలను ప్రస్తావించినందుకే నిర్బంధ చర్యలకు పాల్పడటం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. కోట్లాది రూపాయలు వెచ్చించినప్పటికీ సీతారామ ప్రాజెక్టు ఇప్పటికీ పూర్తి స్థాయిలో అందుబాటులోకి రాకపోవడంతో భద్రాద్రి జిల్లా రైతులు సాగునీటి కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా రైతులకు సాగునీరు అందించడం సంతోషకరమైన విషయమేనని, అయితే అదే సమయంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులను నిర్లక్ష్యం చేయడం ఎందుకని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా గోదావరి జలాలు జిల్లా వ్యాప్తంగా చివరి ఎకరం వరకు చేరేలా చర్యలు తీసుకునే వరకు తమ ఉద్యమం కొనసాగుతుందని స్పష్టం చేశారు. ప్రజల తరఫున అడిగిన ప్రశ్నలకు ప్రభుత్వం సమాధానం చెప్పే వరకు బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని, భద్రాద్రి జిల్లా రైతుల హక్కుల కోసం ప్రజాక్షేత్రంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ పెద్దలు జిల్లా రైతుల ఆవేదనను అర్థం చేసుకుని సీతారామ ప్రాజెక్టును పూర్తిస్థాయిలో పూర్తి చేసి ప్రతి ఆయకట్టుకు సాగునీరు అందేలా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు.

# పైసా వృథా కాకుండా సీతారామ పూర్తి

**చివరి ఆయకట్టు వరకు నీరందిస్తాం**

**కేసీఆర్ పాలనలో ధన దోపిడీ**

**రీ డిజైన్ల పేరిట వేల కోట్ల లూటీ**

**గోదావరి జలాలపై ప్రజా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళిక: డిప్యూటీ సీఎం భట్టి**

**ప్రాణహితకు మళ్లీ ప్రాణం**

**భద్రాద్రి జిల్లాలో సీతారామ ప్రాజెక్టు సందర్శన**



ఖమ్మం/భద్రాద్రి కొత్తగూడెం/సత్తుపల్లి/అశ్వాపురం, జూలై 16: 'కేసీఆర్ హయాంలో గత పదేళ్లపాటు రాష్ట్రంలో ప్రాజెక్టుల పేరుతో ధన దోపిడీ జరిగింది. వేల కోట్లు లూటీ చేశా రు. కాళేశ్వరం, కూలేశ్వరమైంది. సీతారామ ప్రాజెక్టు రీ డిజైన్ పేరుతో భారీ దోపిడీ జరిగింది' అని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఆరోపించారు. గురువా రం భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలం సీతమ్మసాగర్ బరాజ్, సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు పనులను నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో కలిసి క్షేత్రస్థాయిలో ఆయన పరిశీలించి, సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రాజెక్టు వ్యూ పాయింట్ నుంచి నిర్మాణ పనులను పరిశీలించిన అనంతరం నీటిపారుదల శాఖ అధికారులు మ్యాప్‌లు, సాంకేతిక నమూనాల ద్వారా బ్యారేజ్, పంప్‌హౌస్‌లు, కాలు వలు, విద్యుత్ అనుసంధానం, పంపింగ్ వ్య వస్థ, ఆయకట్టు, ఇప్పటివరకు పూర్తయిన ప నులు, మిగిలిన పనులు, అవసరమైన నిధు లు తదితర అంశాలను మంత్రులకు వివరించారు. సమక్ష సమావేశంతో పాటు అనంత రం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. బీఆర్ఎస్ హయాంలో ఇరిగేషన్ ప్రాజెక్టుల రీడిజైన్ల పేరిట దోపిడీకి పాల్పడ్డారని మండిపడ్డారు. 'గతంలో వైఎస్ఆర్ సీఎంగా ఉన్న సమయంలో రుద్రంకోట వద్ద ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టుల ద్వారా 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. అప్పటికే 60 శాతం పనులు పూర్తయ్యాయి. ఈపీసీ విధానం ద్వారా మిగిలిన రూ. 1,500 కోట్లు ఖర్చు పెట్టి ఉంటే ఈపాటికే ఆ భూములకు నీళ్లు పారేవి' అని గుర్తుచేశారు. కానీ, గత బిఆర్ఎస్ ప్రభుత్వం కేవలం అంచనాలను పెంచి దోపిడీ చేయడానికే ఆ ప్రాజెక్టులను 'సీతారామ ప్రాజెక్టు'గా రీడిజైన్ చేసి, సీతమ్మ సాగర్ బ్యారేజీతో కలుపుకొని అంచనా వ్యయాన్ని ఏకంగా రూ.24 వేల కోట్లకు పెంచిందని ఆరోపించారు. పదేళ్ల కాలంలో రూ.7,500 కోట్లకు పైగా ప్రజాధనాన్ని వృథా చేస్తూ దోపిడీకి తెరలేపారు' అని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతూ, సీతారామ ప్రాజెక్టును సాధ్యమైనంత అర్థవంతంగా మరింత అర్థవం తంగా ముందుకు తీసుకెళ్తున్నట్లు వివరించా రు. ' రాజీవ్ కెనాల్ లింక్ కోసం రూ. 100 కోట్లు మంజూరు చేసి ఎన్ఎస్పీ కెనాల్, వైరా రిజర్వాయర్లకు అనుసంధానిస్తున్నారు. పాలేరు రిజర్వాయర్‌కు వెళ్లే జూలూరుపాడు టన్నెల్ పనులను వేగవంతం చేసి, మున్నేరు నదిని లింక్ చేయడం ద్వారా పాలేరు, వైరా, లంకా సాగర్ రిజర్వాయర్లను నింపనున్నామని చెప్పారు. దీనివల్ల సత్తుపల్లి, పరిసర ప్రాంతాల రైతులకు త్వరగా సాగు నీరందిస్తాం' అని వివరించారు. ఈ ప్రాజెక్టు పను ల కోసం ఇప్పటికే రూ.వెయ్యి కోట్ల బిల్లులను విడుదల చేసిందన్నారు. సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ (టన్నెల్) పనులను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగునీరు అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. గోదావరి నదిలో ప్రవహిస్తున్న నీటిని గ్రావిటీ, లిఫ్ట్ ద్వారా గరిష్టంగా వినియోగంలోకి తీసుకురావాలనే ఆలోచనతో ప్రజా ప్రభుత్వం ప్రత్యేక దృష్టిని సారించి ముందుకు వెళుతుందని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. అంతర్జాతీయంగా వస్తున్న వాతావరణ మార్పులు, వి పత్కర పరిస్థితులను తట్టుకునేలా ముందే ఒక ప్రణాళికను సిద్ధం చేసుకుని, రాష్ట్ర ప్రభుత్వం ఆ దిశగా వడివడిగా అడుగులు వేస్తోందన్నారు. మూడు రోజుల క్రితం దేవాదుల లిఫ్ట్ ఇరిగేషన్ వద్ద సమ్మక్క బారేజ్ బ్యాక్ వాటర్ నుంచి నీటిని పూర్తి స్థాయిలో లిఫ్ట్ చేయడం కోసం అన్ని పంపులను ఆన్ చేయడమే కాకుండా, అక్కడ ఉన్న దాదాపు 12 జిల్లాల్లో, 17 నియోజకవర్గాలు, 22 రిజర్వాయర్లను నింపే కార్యక్రమానికి స్వయంగా అక్కడే ఉండి రివ్యూ నిర్వహించినట్టు తెలిపా రు. తెలంగాణ ప్రాంతంలో గోదావరి నదిపై ఉన్న ఈ ప్రాజెక్టును త్వరితగతిన పూర్తి చేసి చివరి ఆయకట్టు వరకు నీరందించాలనేది ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమం లో ఎమ్మెల్యేలు మట్టా రాగమయి, మాలో తు రాందాసు నాయక్, పాయం వెంకటేశ్వర్లు, అదినారాయణ, కోరం కనకయ్య, గి డ్డంగుల శాఖ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళా దుర్గాప్రసాద్, జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ, జిల్లా కలెక్టర్ దివాకర్, పోలీస్ కమీషనర్ సునిల్ దత్ హాజరైయ్యారు.

### కాలయాపన చేయం: మంత్రి పొంగులేటి

సీతారామ ఎత్తిపోతల పథకం పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పష్టం చేశారు. డిజైన్ల మార్పుల పేరుతో కాలయాపన చేసే ఉద్దేశం తమకు లేదని స్పష్టం చేశారు. ఈ కరువు కాలంలో కూడా ఏన్కూర్ లింక్ కెనాల్ ద్వారా 1.20 లక్షల ఎకరాలకు సాగునీరు విడుదల చేసి రైతులకు అండగా నిలిచామని ఆయన వివరిం చారు. రైతుల సంక్షేమమే ప్రజాప్రభుత్వ ధ్యేయమన్నారు. సమీక్షలో సీతారామ భూసేకరణ పనుల కోసం వెంటనే 135 కోట్ల రూపాయలను విడుదల చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన బిల్లులు సిద్ధం చేసి వెంటనే టోకెన్లు పంపాలని కలెక్టర్లను ఆదేశించారు.

### ప్రాణహితకు మళ్లీ ప్రాణం: మంత్రి ఉత్తమ్

తెలంగాణ రైతాంగ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని సాగునీటి రంగంలో చారిత్రాత్మక నిర్ణయాలతో కాంగ్రెస్ ప్రభుత్వం ముందుకు సాగుతోందని నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎన్నో ఏళ్లుగా పెండింగ్లో ఉన్న సీతారామ ఎత్తిపోతల పథకం, సీతమ్మసాగర్ ప్రాజెక్టు, దేవాదుల ఎత్తిపోతల పథకాలను ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే పూర్తి చేసి రైతుల కలలను సాకారం చేస్తామని ఆయన ప్రకటించారు. దివంగత మాజీ సీఎం వైఎస్ఆర్ ప్రారంభించిన డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ప్రాణహితచేవెళ్ల సు జల స్రవంతి ప్రాజెక్టును మళ్లీ పట్టాలెక్కించేందుకు తెలంగాణ ప్రభుత్వం వేగంగా అడుగులు వేస్తోందని మంత్రి తెలిపారు. సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు గత ప్రభుత్వం అవసరమైన పర్యావరణ అనుమతులు లేకుండానే పనులు ప్రారంభించడంతో న్యాయపరమైన సమస్యలు తలెత్తాయని మంత్రి గుర్తు చేశారు. ప్రస్తుతం సుప్రీంకోర్టులో ప్రభుత్వం సమర్థంగా పోరాడుతోందని, అవసరమైన అన్ని కేంద్ర అనుమతులు సాధించి చట్టబద్ధంగా పనులు పూర్తి చేస్తామని చెప్పారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ప్రతి సాగుభూమికి గోదావరి జలాలు అందిస్తామన్నారు. భూసేకరణ, పర్యావరణ అనుమతులు, సాంకేతిక అంశాలన్నింటినీ వేగంగా పరిష్కరించి ప్రాజెక్టులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ జాతీయ డ్యామ్ భద్రతా సంస్థ సూచనల మేరకు అత్యున్నత సాంకేతిక ప్రమాణాలతో కొనసాగుతోందని మంత్రి తెలిపారు. అన్ని పరీక్షలు పూర్తయి భద్రతా ధ్రువీకరణ లభించిన తర్వాతే బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తీసుకువస్తామని స్పష్టం చేశారు.

## బోనం ఎత్తిన గోల్కొండ

మొదటి పేజీ తరువాయి

ఐక్యతకు ప్రతీకగా నిలుస్తాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ సలహాదారు వి హనుమం తరావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మాజీ ఎంపీ మధుయాష్కిగౌడ్, తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామ య్యర్, డైరెక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ కలెక్టర్ ప్రియాంక అలా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ ఏనుగు నర్సింహారెడ్డి, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

### ఏర్పాట్లను పరిశీలించి సజ్జనర్

హైదరాబాద్ సిటీ బ్యూరో (విజయక్రాంతి): గోల్కొండ బోనాల ఉత్సవాల ఏ ర్పాట్లను సీపీ సజ్జనర్ పరిశీలించారు. అనంతరం జగదాంబికా మహంకాళి అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

### కనకాల కట్ట మైసమ్మకు తొలి బోనం

ముషీరాబాద్(విజయక్రాంతి): ఆషాఢ మాస బోనాలను పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర కుమ్మరి సంఘం ఆధ్వర్యంలో గురువారం కుమ్మర్లు తొలి బోనం జాతర అంగరంగ వైభవంగా నిర్వహించారు. లోయర్ ట్యాంక్ బండ్ వద్ద ఉన్న శ్రీ కనకాల కట్టమైసమ్మ అమ్మవారికి తొలి బోనం సమర్పించారు. వేడుకల్లో మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, ఎంపీ ఈటల రాజేందర్, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్ కృష్ణయ్య, ఎమ్మెల్యేలు వీరపల్లి శంకర్, దానం నాగేందర్, కార్పొరేషన్ చైర్మెన్లు మెట్టు సాయి కుమార్, మల్ రెడ్డి రాంరెడ్డి, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ తదితరులు హాజరయ్యారు.

## దూరదృష్టి లేకనే అంధకారం

మొదటి పేజీ తరువాయి

బొగ్గు నిల్వలు అడుగంటుతున్నాయని, బీఆర్ఎస్ నిద్ర లేపినా ప్రభుత్వం మేల్కొనలేదని విమర్శించారు. కొత్తగూడెం, కాకతీయ, భద్రాద్రి, యాదాద్రి పవర్ స్టేషన్లలో 67 రోజులకు మించి బొగ్గు నిల్వలు లేవని వెల్లడించారు. రాష్ట్రంలో 7,180 మెగావాట్ల థర్మల్ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం ఉన్నా కేవలం 3,190 మెగావాట్ల ఉత్పత్తి మాత్రమే జరిగిందన్నా రు. బొగ్గు సరఫరా, నీటి నిల్వలు, విద్యుత్ కేంద్రాల నిర్వహణలో వైఫల్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందన్నారు. గురువారం తెలంగాణ భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. బొగ్గు, పవర్, సాండ్, ల్యాండ్ స్కాంలతో కాంగ్రెస్ పాలన అంతా కుంభకోణాలమయంగా మారిందని విమర్శించారు. అడ్డగోలు ధరకు 80 మిలియన్ యూనిట్‌ల విద్యుత్‌ను పవర్ మార్పిడి ద్వారా కొనుగోలు చేస్తున్నారని, ఆ భారం వినియోగదారులు, పారిశ్రామికవేత్తలు ఎందుకు భరించాలని ప్రశ్నించారు.

### ఇతర రాష్ట్రాలకు క్వాలిటీ బొగ్గు, తెలంగాణకు నాసిరకం

రోజువారీ బొగ్గు ఉత్పత్తి, నాణ్యతకు సంబంధించిన సమాచారం ప్రజలకు తెలియకుండా సింగరేణి వెబ్‌సైట్‌ను మూసివేశారని హరీశ్‌రావు ఆరోపించారు. తెలంగాణలో నాణ్యమైన బొగ్గును పక్క రాష్ట్రాలైన తమిళనాడు, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్‌కు తరలిస్తూ, ఇక్కడి




ప్లాంట్లకు నాసిరకం బొగ్గు ఇస్తున్నారని, దీనివల్ల విద్యుత్ ఉత్పత్తి తగ్గిందని మండిపడ్డారు. లో ఓల్టేజీతో మోటార్లు కాలిపోవడం, ట్రాన్స్‌ఫార్మర్లు పేలిపోతున్నాయని, త్రీ ఫేజ్ కరెంట్ కోసం రైతులు రాత్రంతా పొలాల వద్ద జాగారం చేయాల్సిన దుస్థితి ఏర్పడిందన్నారు. రైతులకు 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయకపోతే బీఆర్ఎస్ ఉద్యమం చేపడుతుందని హెచ్చరించారు. ఖమ్మం జిల్లాలో మంత్రులు ప్రారంభించిన సీతారామ ఎత్తిపోతల పథకం మో టార్లు కేసీఆర్ ప్రభుత్వం ఏర్పాటు చేసినవేనన్నారు. రాష్ట్రంలోని రిజర్వాయర్ల నీటి నిల్వ సామర్థ్యం 1,0 59 టీఎంసీలు కాగా ప్రస్తుతం కేవలం 351 టీఎంసీలు(33.17 శాతం) మాత్రమే ఉన్నాయన్నారు. ప్రభుత్వానికి నీళ్ల మీద, పవర్ పైన ధ్యాసే లేదని, వారి ధ్యాసంతా కమీషన్లు, కొట్లాటల మీదనే ఉందని విమర్శించారు.

## పూరీ జగన్నాథ రథయాత్రలో తొక్కిసలాట

మొదటి పేజీ తరువాయి

'నందిఘోష' రథం కదిలింది. అయితే రథయాత్రలో స్వల్ప అపశ్రుతి చోటుచేసుకుంది. భారీ రద్దీతో తొక్కిసలాట జరిగి ఒకరి మృతి చెందినట్లు సమాచారం. శాశ్వ ఆడక ఇబ్బంది పడుతున్న 150మందిని భద్రతా సిబ్బంది ఆస్పత్రికి తరలించారు. పూరి గజపతి మహారాజ దివ్యసింహదేవ్ మూడు రథాల ముందున్న మార్గాన్ని బంగారు చీపురుతో శుభ్రం చేసి రథయాత్రను ప్రారంభించారు. ఈ ఆలయం నుంచి, దేవుళ్ల జన్మస్థలంగా భావించే సుమారు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న రథయాత్ర గుండిచా ఆలయం వరకు కొనసాగింది. వర్షం తగ్గుముఖం పట్టడంతో, 'హరి బోల్' నినాదాలు, తాళాలు, బాకాలు, శంఖాల ధ్వనుల మధ్య పెద్ద సంఖ్యలో భక్తులు ఈ ఉత్సవాన్ని వీక్షించారు. అంతకుముందు, 'పహండి' లేదా సంప్రదాయ ఊరేగింపు ద్వారా దేవుళ్ల విగ్రహాలను రథాల వద్దకు తీసుకువచ్చారు. ముందుగా శ్రీ సుదర్శనుడు రథం ఎక్కగా, ఆ తర్వాత దేవి సుభద్ర, బలభద్ర స్వామి, జగన్నాథ స్వామి రథం ఎక్కారని ఆలయ అధికారి తెలిపారు. రథయాత్ర వెళ్లే మార్గంలో, వర్షపు నీరు నిల్వ ఉండకుండా, ఊరేగింపు సాఫీగా సాగేలా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ప్రతి సంవత్సరం ఒడియా మాసమైన 'ఆషాఢ శుక్ల పక్షం' రెండో రోజున జరిగే రథయాత్ర, ఆలయంలోని రత్న సింహాసనం (రత్నఖచిత సింహాసనం) నుంచి ఆ దేవుళ్లను బయటకు తీసుకువచ్చే ఏకైక సందర్భం ఇదే. భారీ వర్షం భక్తుల ఉత్సాహాన్ని ఏమాత్రం తగ్గించలేక పోయింది. వారు 'గ్రాండ్ రోడ్'పై నృత్యం చేస్తూ రథోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం నుంచి పూరీలో గురువారం వరకు 23.3 సెం. మీ వర్షపాతం నమోదైందని భారత వాతావరణ శాఖ అధికారి తెలిపారు.

### ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక : ప్రధాని మోదీ

పూరి రథయాత్ర భారతదేశ ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వానికి ప్రతీక అని ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ వేదికగా శుభాకాంక్షలు తెలిపారు. జగన్నాథుడి ఆశీస్సులతో అందరూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. రథయాత్రకు భారీ సంఖ్యలో భక్తులు వస్తారన్న అంచనాతో ఒడిశా ప్రభుత్వం కనీవినీ ఎరుగని రీతిలో ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం భారతీయ రైల్వే జగదల్పూర్, రాయ్‌గఢ్ నుంచి పూరీకి ప్రత్యేక రైళ్లను నడుపుతోంది. యాత్రలో భద్రత కోసం 13వేల మందికి పైగా పోలీసులు, కేంద్ర బలగాలను మోహరించారు. 19 మంది సీనియర్ ఐపీఎస్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నా రు. 473 ఏఐ సీసీటీవీ కెమెరాలు, 65 భారీ ఎల్ఈడీ స్క్రీన్లను ఏర్పాటు చేశారు. అహ్మదాబాద్‌లో జరిగిన రథయాత్రలో హోంమంత్రి అమిత్ షా హాజరయ్యారు. సీఎం భూపేంద్ర పటేల్, డిప్యూటీ సీఎం హర్ష్ సంఘ్వీలు రథయాత్రను ప్రారంభించారు. అటు పాట్నాలో సీఎం సమ్రాట్ చౌదరి జగన్నాథ స్వామికి హారతి ఇచ్చి రథయాత్రను ప్రారంభించారు.




## ఘనంగా జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవం

**దశ సూర్యాపేట ప్రతినిధి :** శ్రీ వేణుగోపాల స్వామి దేవాలయంలో గోదా మురళి స్వామి అండలు గోష్టి ఆధ్వర్యంలో గురువారం రాత్రి శ్రీ జగన్నాథ స్వామి రథయాత్ర మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం 6 గంటలకు శ్రీ జగన్నాథ స్వామి, బలభద్రుడు, సుభద్ర అమ్మవార్లకు 11 రకాల ప్రసాదాలతో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం దేవాలయం వెలుపల నుంచి శ్రీ జగన్నాథ స్వామి పవిత్ర రథయాత్రను వైభవంగా నిర్వహించగా, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ప్రాంగణమంతా భక్తుల గోవింద నామస్మరణలతో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమంలో శ్రీ వేణుగోపాలస్వామి దేవాలయ ప్రధాన అర్చకులు నల్లంచక్రవర్తుల మురళీధరచార్యులు, కందిమల్ల శంకర్ , మాశెట్టి విజయ్ కుమార్, గట్ల సోమయ్య, భైరూ విజయ్ కృష్ణ, శ్రీరంగం రాము తో పాటు మహిళా భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



## మతపరమైన బోధనల ఆరోపణలపై విచారణ జరపాలి: ఏబీవీపీ

**దశ ఓయూ:** రెండో తరగతి విద్యార్థికి బలవంతంగా మతపరమైన బోధనలు (కల్మా) చేయించారనే ఆరోపణలపై సంబంధిత అధికార యంత్రాంగం వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని ఏబీవీపీ తెలంగాణ రాష్ట్ర జాయింట్ సెక్రటరీ అలివేలి రాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యాలయాలు విద్యను బోధించే కేంద్రాలుగానే ఉండాలని, ఏ మతానికైనా ప్రచార వేదికలుగా మారకూడదన్నారు. విద్యార్థుల ఇష్టానికి విరుద్ధంగా మతపరమైన బోధనలు చేయడం రాజ్యాంగ స్ఫూర్తికి, విద్యా విలువలకు విరుద్ధమని పేర్కొన్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ అధికారులు తక్షణమే స్పందించి పూర్తి స్థాయి విచారణ నిర్వహించాలని, ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత పాఠశాలపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే గుర్తింపును రద్దు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని ఆయన కోరారు.



## ఆరోపణలు నిరూపిస్తే అధ్యక్ష పదవికి రాజీనామా

**ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బెలిదె శ్రీనివాస్**

**దశ సూర్యాపేట ప్రతినిధి :** తనపై జిల్లా యువజన అధ్యక్షుడు బొమ్మిడి అశోక్ చేసిన ఆరోపణలను నిరూపిస్తే వెంటనే అధ్యక్ష పదవికి రాజీనామా చేస్తానని ఆర్యవైశ్య సంఘం పట్టణ అధ్యక్షుడు బెలిదే శ్రీనివాసులు సవాల్ విసిరారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాసవి కన్యక పరమేశ్వరి దేవాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను గెలుపు కోసం కృషి చేసిన వారికి పదవులు ఇస్తానని ఎప్పుడూ చెప్పలేదని స్పష్టం చేశారు. యువజన అధ్యక్షుడిగా ఉన్న బొమ్మిడి అశోక్ ఆర్యవైశ్య సమాజానికి చేసిన సేవలేమిటో చెప్పాలని ప్రశ్నించారు. తాను అధ్యక్ష పదవిలో లేకపోయినా అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించానని తెలిపారు. తనపై నిరాధార ఆరోపణలు చేసిన బొమ్మిడి అశోక్ బహిరంగంగా క్షమాపణ చెప్పాలని, లేనిపక్షంలో న్యాయపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు. అనంతరం పలువురు ఆర్యవైశ్య సంఘ సభ్యులు మాట్లాడుతూ, పట్టణ వర్కింగ్ ప్రెసిడెంట్ పదవికి రూ.10 లక్షలు తీసుకున్నారనే ప్రచారం పూర్తిగా అవాస్తవమని ఖండించారు. సంఘంలో ప్రతి రూపాయి ఖర్చును సభ్యుల సమక్షంలోనే పారదర్శకంగా నిర్వహిస్తామని పేర్కొన్నారు. వ్యాపారాలను పక్కనబెట్టి సమాజ సేవ కోసం పనిచేస్తున్న వ్యక్తిపై ఆధారాలు లేకుండా ఆరోపణలు చేయడం తగదని అన్నారు. పట్టణ ఆర్యవైశ్య సభ్యులకు పదవుల కేటాయింపు కూడా సభ్యులందరి సమక్షంలోనే జరుగుతుందని, వర్కింగ్ ప్రెసిడెంట్ పదవిని రద్దు చేశామని ఎప్పుడూ చెప్పలేదని, ఆ పదవిపై తుది నిర్ణయం తర్వాత తీసుకుంటామని స్పష్టం చేశారు. సంఘ వ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీసేలా వ్యాఖ్యలు చేయడం సమంజసం కాదని సభ్యులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిక్కుమళ్ల కృష్ణ, వుప్పల సత్యనారాయణ, రాచకొండ శ్రీనివాస్, వుప్పల శ్రవణ్ కుమార్, మిట్టపల్లి రమేష్, బొల్లం సురేష్, తోట లక్ష్మి నర్సయ్య, బచ్చు జగన్మోహన రావు, చల్లా సత్యనారాయణ, గుడిపాటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

## యూత్ డిక్లరేషన్ ఓ వంచన

మొదటి పేజీ తరువాయి

మోసం చేసిన మోసకారి ప్రభుత్వంగా కాంగ్రెస్ మారిందని, అందుకే సమాజంలోని ప్రతి వర్గం ఆ ప్రభుత్వాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తోందని విమర్శించారు. ఆడబిడ్డల నుంచి అన్నదాతల వరకు, విద్యార్థుల నుంచి నిరుద్యోగ యువత వరకు ఏ ఒక్కరికీ ఇచ్చిన హామీలను అమలు చేయలేదని కేటీఆర్ మండిపడ్డారు. ప్రజాసంక్షేమాన్ని పూర్తిగా విస్మరించి, అవినీతి, స్కాంలు, అక్రమాలు, అరాచకాలనే పాలనగా మార్చుకున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలు, అనుసరిస్తున్న విధానాలు, పాలన ప్రజాకంటకంగా మారాయన్నారు. స్వయంగా ముఖ్యమంత్రి చేయించుకున్న సర్వేలోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్రమైన ప్రజా వ్యతిరేకత వ్యక్తమైందని కేటీఆర్ పేర్కొన్నారు. కాంగ్రెస్ సర్కార్ కాలం ముగిసిపోతుందనే విషయం స్పష్టమవుతున్న నేపథ్యంలోనే ముఖ్యమంత్రి అడ్డగోలుగా మాట్లాడుతూ తన అక్కసును వెళ్లగక్కుతున్నారని పేర్కొన్నారు.

Printed, Published and Owned by B.KALPANA and Printed at Kalpana Publications , Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505, and Published at Flat No.101,Sri Heights Apartment,Shilpi Colony,Pasumamula Road,Pedda Amberpet,Rangareddy,Telangana-501505. Editor: B.KALPANA. PRGI.No.TGTEL/25/A4195. Cell 9848288850, namasteshekar@gmail.com